# హిప్ హిప్ బర్రే....

*(ఉగాది కొంటె కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ)*

పుల్లమ్మ, పల్లారావులు పుణ్యదంపతులు.

పుల్లమ్మ పూజల ఫలంగా పుల్లారావు దొరికాడో, పుల్లారావు పుణ్యం కొద్దీ పుల్లమ్మ దొరికిందో సృష్టి విచారణ చేయగలిగిన జ్ఞానులకి కూడా అంతుచిక్కని విషయం. పుల్లారావుకి లోకల్ గ్రంథాలయంలో చిన్న ఉద్యోగం వచ్చేవాళ్ళకి స్వాగతం చెప్పి వాళ్ళ చేతిలో వున్న వస్తువులు తీసేసుకోవడం, వెళ్ళే వాళ్ళకి ధన్యవాదాలు చెప్పి వస్తువులు తిరిగి ఇచ్చేయ్యడం అతడి ఉద్యోగ ధర్మం. అయినా పుల్లారావు ఎప్పుడూ ఎవరికీ స్వాగతాలు, ధన్యవాదాలు చెప్పడు. ఒకపక్కగా కూర్చుని కవిత్వం రాసుకుంటూ వుంటాడు.అతనికి కవిత్వం రాయలని గట్టి ఉబలాటం. అందులో ఈ మధ్యన వస్తున్న వచన కవిత్వం చదివాక ధైర్యం వచ్చి కలం పట్టి కవిత్వం రాస్తున్నాడు. గ్రంథాలయంలోని బోర్డులన్నిటిని కవితా హృదయంతో తిప్పి రాసి గోడలకి అతికించాడు. 'పొగపీల్చకు... పాఠకా! వృధ మిగల్చకు' ఇది పొగత్రాగరాదుకి అతడి సృష్టి. అలాగే 'నీశబ్దం.' నా శబ్దం కావాలోయ్ అందరికి నిశ్శబ్దం అసలు పుల్లారావు కవితా హృదయాన్ని గ్రంథాలయపు గోడల పైన ఎగబడి చదవడానికొచ్చే వాళ్ళ సంఖ్య ఎక్కువైందని అధికారులు ఆందోళన వెలిబుచ్చారు.

ఇహ పుల్లమ్మ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే పొరిగిళ్ళ పుల్లమ్మంటే సరిపోతుంది. పుల్లారావు ఆఫీసుకంటూ అటు వెళ్ళగానే పుల్లమ్మ పెత్తనాలకి బయల్దేరుతుంది. ఎక్కే గుమ్మం దిగే గుమ్మం వీళ్ళేం చేస్తున్నారు. వాళ్ళేంకొనుక్కున్నారు! వాళ్ళాయన రోజూ తాగొస్తాడా? వీళ్ళాయన తాగితే అసలు రాడా! అన్ని విషయాలు సేకరించి సాయంత్రం భర్త ఇంటికి రాగానే అక్షరం పొల్లుపోకుండా అన్నీ చెప్తుంది. భార్య ఉపన్యాసాలు వింటుంటే పుల్లారావుకి కవితావేశం వచ్చేస్తుంది. మూగగా కన్నీళ్ళు కారుస్తాడు.

పుల్లమ్మ తల్లి కనకమ్మ. ఆవిడకి ఉబ్బసం జబ్బు మొదలై పదేళ్ళయింది. వైద్యానికంటూ వచ్చి కూతురింట్లో జెండాప్రతిష్ఠించి ఏడాది కావొస్తోంది. తల్లిని వెతుక్కుంటూ పుల్లారావు బావమరిది రత్తయ్య కూడా వచ్చి స్థిరపడి ఆర్నెల్లు కావస్తోంద. రత్తయ్య చర్మవ్యాధితో తీసుకుంటున్నాడు. గోక్కోడానికి అతడికి రెండు చేతులు, ఇరవై నాలుగ్గంటలూ చాలటంలేదు. ఒకరోజున ఉబ్బసం తల్లి, చర్మవ్యాధి తమ్ముడు పుల్లమ్మని కూర్చోపెట్టి వాళ్ళ మనసులో మాటకాస్తా చెప్పారు. 'ఎంత కన్న కూతురివైనా ఇలా నీ ఇంట్లో ఎంతకాలం వుండగలం. పోని వెళ్ళిపోదామంటే డాక్టరుససేమిరా కదలకూడదంటున్నాడాయే. అంతు చూస్తేనేగాని వదలనంటున్నాడు. మాకైతే మహా సిగ్గుగా ఉంటోంది. అల్లుడి ముందు ఆయాసపడటానకి నేను, గోక్కోవడానకి వాడూ ఎంత మొహమాట పడిపోతున్నామో నీకేం తెలుసు? అంచేత మేం ఒక నిర్ణయానికొచ్చాం. చాకిరీ మేమిద్దరం చేసి, నీకు రెండు డబ్బులు నెలతిరిగేసరికి వచ్చిపడే పథకం ఆలోచించాం. నువ్వు చెయ్యవలసిందల్లా నీ మొగుడి చేత ఆ సంగీతం మాస్టారు. అమ్మకానికి పెట్టిన బర్రెని కొనిపించు. అంతే.'

సరిగ్గా ఆ సమయానికి పుల్లారావు గ్రంతాలయంలో అత్తగారి ఉబ్బసాన్ని, బావమరిది చర్మ వ్యాధిని కవితా వస్తువులుగా తీసుకొని కావ్య సృష్టి చేస్తున్నాడు. 'ఉబ్బసం...ఉల్లాసం...ఉ..బ్బసం...ఉబ్బసం.. ఆయస ప్రవాహం...నిద్రపట్టని రోగి ఒంటికి కాపలా...ఉబ్బసం రావాలోయ్ ఊళ్ళో కొద్దిమందికైనా' అంటూ. అలాగూ చర్మవ్యాధి గురించి 'చర్మ వ్యాధా? కాదది ఖర్మవ్యాధి, ఎరుపెక్కిన చర్మం వికసించిన మందారం. గోకటం మాని గోరు వెచ్చనీళ్ళు గుమ్మరించి చూడు. ఓహ్ నీకేమోయ్ అదృష్టవంతుడి...!'

ఈ విధంగా సాయంత్రం సూర్యుడు. అస్తమించేదాకా జ్ఞాపకం వచ్చిన ప్రతి జబ్బు గురించి పదేసి పంక్తులు రాసి ఇంటిదారి పట్టాడు. పుల్లమ్మ భర్తకి గుమ్మంలోనే అసలు సంగతి కాస్తా చెప్పేసింది. 'సంగీతం మాష్టారు బర్రెని అమ్ముతున్నారట. మనం కొంటున్నాం. రోజుకి పది లీటర్ల పాలు ఇస్తుందట. అంటే రోజుకి యాభై రూపాయల ఆదాయం నెలకి పదిహేనువందలు. దానికి చాకిరీ మా అమ్మ తమ్ముడూ చేస్తారు. కట్టేసుకోడానికి వెనక బోల్డంత స్థలం వుంది. పైగా చవగ్గా కూడాఇస్తానంటున్నాడు. కాదనకండి' బతిమలాడసాగింది.

కవిత్వంతో నిండిపోయిన పుల్లారావుబుర్రలోకి బర్రె తాలూకు ఆలోచన్లు ప్రవేశించ లేకపోవడం చేత భార్య ప్రతిపాదనని గుమ్మంలో వచన రూపంలోనే వీటో చేసి లోనికి వెళ్ళాడు. కాని పుల్లమ్మ అంత తేలిగ్గా వదిలే రకం కాదు. హోరాహోరీగా వాదించింది. ఉబ్బసం తల్లిచేత చర్మవ్యాధి తమ్ముడి చేత చెప్పించింది. అయినా పుల్లారావు వీల్లేదన్నాడు. బర్రెల్ని, గొర్రెల్ని మేపే

స్థోమత తనకి లేదని ఖండితంగా తేల్చి చెప్పేశాడు.

లాభం లేదని పుల్లమ్మ తన వద్దనున్న ఆఖరి అస్త్రాన్ని ప్రయోగించింది. 'అంతే లెండి దేనికైనా ప్రాప్తం అంటూ వుండాలి. అసలైనా బర్రంటే ఏమిటనుకుంటున్నారు? దాన్ని జంతువుగా చూడకండి. ఇంటికి మహాలక్ష్మి. ఇంటి యజమానికి అదృష్టం. అసలు బమ్మెర పోతన అంత గొప్పవాడు ఎందువల్ల అయ్యాడు? ఆయన పెంచిన బర్రెవల్ల. కృష్ణుడు ఆవును, కుమారస్వామి, చివరికి వినాయకుడు వీళ్ళంతా ప్రజలకి అంత దగ్గర ఎందుకయ్యారు జంతుపాలన వల్ల. అంచేత ఆలోచించండి'

పుల్లారావు అప్పటికే ఆలోచనలో పడిపోయాడు. కళ్ళముందు దృశ్యం కనిపిస్తోంది. తాను ఏనుగు పైన తెల్ల శాలువా కప్పుకుని శాంతిదూతలాగా ఎగబడి పోతున్న జనానికి చేతులు ఊపుతూ సందేశం ఇస్తున్నాడు. సన్మానం జరిగే స్థలం వద్ద ఏనుగుపై నుంచి దిగాడు. వాకిట్లో కట్టేసివున్న బర్రెకి తను సాష్టాంగపడి నమస్కారం చేశాడు. తన మెళ్ళో దండని దాని మెళ్ళో వేసాడు. జనం చప్పట్లు. కెమేరాలు క్లిక్. క్లిక్ శబ్దాలు.

పుల్లారావు బర్రెని కొనడానికి పూర్తిగా ఒప్పుకున్నాడు.

మూడు రోజుల తర్వాత బర్రె గృహప్రవేశం చేసింది. నల్లగా ఆరోగ్యంగా ఉంది. తలెత్తి ఎవరివంకా చూడటంలేదు. పాపం మొహమాటం గల బర్రే అనుకున్నాడు పుల్లారావు. బర్రెని చూసినప్పుడు అత్తగారు, అత్తగార్ని చూసినప్పుడు బర్రె గుర్తుకురావడం చిత్రంగా అనిపించింది. దొడ్లో కట్టేశారు. కాస్త గడ్డి, బోల్డన్ని పాత పేపర్లు దాని ముందు పడేశారు తినమని. కాని బర్రె ఎంగిలి పడలేదు. మొదటిసారి అత్తవారింటికి వెళ్ళినప్పుడు అన్నం సహించని సంఘటన లీలగా గుర్తుకొచ్చింది పుల్లారావుకి.

పుల్లారావుకి ఆలస్యంగా లేవడం అలవాటు. కానీ బర్రె వచ్చిన మర్నాడు నాలుగ్గంటలకి–ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. బర్రె భోరున ఏడుస్తోంది. పుల్లారావు కంగారుగా జారిపోతున్న లుంగీని గుండెల పైకి లాక్కుంటూ దొడ్లోకి పరిగెట్టాడు. కానీ ఏడుస్తున్నది బర్రెకాదు. తన భార్య. చీకట్లో ఒక మూలంగా ఎవరో విసిరేసినట్లు పడిపోయి, మెలికలు తిరుగుతూ ఏడుస్తోంది. అత్తగాడు ఆయాసపడుతూనే బర్రెని అక్షులు పక్షులు తిట్టిపోస్తోంది. బావమరిది గోడకేసి వీపుని రుద్దుకుంటూ తన్మయత్వంలో మునిగి తేలుతున్నాడు. బూతు పాలు వద్దని బర్రె పాలు కొనడానికి సిద్దపడ్డ చుట్టుపక్కల వాళ్ళు చెంబులు, గిన్నెలతో చుట్టూ నిల్చున్నారు. బర్రెమాత్రం తనకేం పట్టనట్టు నాలుగు కాళ్ళపైన నిగడతన్ని నిల్చుంది. పుల్లారావుని చూడగానే అక్కడి వాళ్ళంతా జరిగింది మొత్తం చెప్పారు. పుల్లమ్మ అందరి సమక్షంలో పాలు పితకటానికి దగ్గరగా వెళ్ళి పొది మీద చెయ్యి వెయ్యగానే బర్రె ఎగిరి వెనక రెండు కాళ్ళతో ఆమెని తన్నింది.' అలా రెండుసార్లు జరిగిందిట.

పుల్లారావుకి భార్యని ఓదార్చాల్లో, బర్రెని మందలించాలో తెలీక ఒక్క క్షణం అలా చూస్తూనిల్చుండిపోగా, పాలకోసం వచ్చిన ప్రజలు ఆ పని చూడమని కర్తవ్య బోధన చేయడంతో పుల్లారావు ఇక తప్పక భార్య పక్కన వున్న స్టీలు బకెట్ తీసుకుని లుంగీని బిగించి కట్టి, బర్రెకి కాస్త దూరంగా మెల్లిగా, చప్పుడు చేయకుండా చటుక్కున కూర్చుని వ్యూహ రచన చేసుకోసాగాడు. బర్రె అంతా గమనించింది. కానీ చూడనట్లు తల తిప్పుకుంది. బర్రెకి, భగవంతునికి అంతా సమానమే! పుల్లారావుకి పాక్కుంటూ బర్రెని సమీపించడం, మెల్లిగా చూపుడు వేలితో దాని పొదిని తాకడం గుర్తుంది. తర్వాత అతని కేం తెలీదు. అంతా చీకటి బాధ తప్ప.

పుల్లారావు ఇప్పుడు ఆలోచనలతో సతమతమైపోతున్నాడు. బర్రె పాలు ఎందుకు ఇవ్వడం లేదు. గడ్డే తింటోంది. పేపర్లు తింటోంది. పేడ రెండు పూటల వేస్తోంది. కాని పాలు మాత్రం ఇవ్వడం లేదు. దగ్గరికి వెడితే గాడిద తన్నులు తంతోంది. చుట్టుపక్కల అందరికీ ఎగతాళిగా తయారైంది. పుల్లారావుకి పౌరుషం వచ్చేసింది. గ్రంథాలయంలో బర్రె పాలు పితకడం ఎలా? అనే పుస్తకాల కోసం వెతికాడు. కానీ ఎవరూ ఈ సమస్యని గుర్తించినట్టు లేదు. ఒక్క పుస్తకం కూడా లేవు. ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి? సంప్రదిద్దామంటే బర్రెని అమ్మిన సంగీతం టీచరు మద్రాసు వెళ్ళి పోయట్ట, పుల్లారావు సతమతమైపోతుండగా బావ మరిది గోక్కుంటూనే పరిగెత్తి గ్రంథాలయానికి వచ్చి చల్లటి వార్త చెప్పాడు 'బర్రె పాలు ఇస్తోందని.' పుల్లారావు సంతోషానికి అంతులేదు. బామ్మర్దికి చర్మవ్యాధి లేకుండా వుంటే చల్లటి వార్త చెప్పినందుకు ముద్దు పెట్టుకునుండేవాడు. ఇంతకీ ఎలా సాధ్యపడిందంటే–చెప్పుకొచ్చాడు. రేడియోలో త్యాగరాజస్వామి కీర్తన వస్తుంటే బర్రె బ్లాంకైపోయి, తన్మయత్వంగా నిల్చుండిపోగా తనే ధైర్యం చేసి గిన్నె తీసుకుని పాలు పితకడానికి వెడితే అది ఏ మాత్రం అడ్డు చెప్పకుండా ఆరు లీటర్లు పాలు ఇచ్చిందట. తర్వాత టేపు రికార్డర్‌సాయంతో ఇంకో నాలుగు లీటర్లదాకా పితికేసారట. సంగీతం వింటేనేగాని బర్రెపాలు ఇవ్వదతెలిసొచ్చిందట.

సంగీతం టీచరుగారు కీర్తనలు పాడుకుంటూ పాలుపితికేవాట్ట. పాతికేళ్ళుగా అలవాటుపడిన బర్రె భిన్నమైన వాతావరణంలో పాలు ఇవ్వడానికి ఇచ్చగించకపోవడం సహజం.

సంగీతం రాళ్ళని కరిగిస్తుందని విన్నదేగాని, బర్రెలచేత పాలు ఇప్పిస్తుందని కళ్ళారా చూస్తున్నాడు. కవిత్వంకన్నా సంగీతం గొప్పది.

పుల్లారావు కావ్య రచనలు మానేసి, ప్రస్తుతం సంగీత సాధన చేస్తున్నాడు